ప్రజాశక్తి
శనివారం 12 ఆగస్టు 2023 5
అనంతపురం

బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర నాటక అకాడమీ నూతన ఛైర్‌పర్సన్‌గా ప్రమీల గురువారం రాష్ట్ర నాటక అకాడమీ సిఇఒ మల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌భార్గవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రమీలా మాట్లాడుతూ తనకు రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన సిఎం జగన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, అనంతపురం డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నియామక ఉత్తర్వులను అందుకుంటున్న నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల

పేరు ఘనం నిర్వహణ అధ్వానం..!

- దయనీయ స్థితిలో శింగనమల చెరువు
- రెండు కోట్లకుపైగా ఖర్చు పెట్టినా అంతంతే
- దెబ్బతిన్న పంటకాలువలు, స్లూయిస్‌లు

శింగనమల చెరువు

ఇసుక మూటలతో కప్పి పెట్టిన పట్నాల తూము

పంటకాలువలు తెగి బయటకు వెళ్తున్న నీరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేరు గొప్ప...ఊరు దిబ్బ అన్న చందంగా మారింది శింగనమల చెరువు పరిస్థితి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతిపెద్ద చెరువుల్లో రెండోదిగా శింగనమల చెరువుకు పేరుంది. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో నిర్మించిన ఈ చెరువు కింద సుమారు మూడు వేల ఎకరాల భూమి సాగవుతుంది. ఇటువంటి చెరువు నిర్వహణ అధ్వాన్నంగా మారింది. దీన్ని బాగు చేసేందుకు రెండు కోట్ల రూపాయలకుపైగా ఖర్చు పెట్టినా ప్రయోజనం లేని విధంగా మారింది.

నాశిరకం పనులతో ఎక్కడికక్కడ తెగిన పంటకాలువలు

చెరువులను బాగు చేసేందుకు ప్రపంచబ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం రుణం తీసుకుంది. ఎపిఐఐపిఎటిపి కింద జిల్లాలోని అనేక చెరువుల మరమ్మతులను చేపట్టింది. ఇందులో శింగనమల చెరువు కూడా ఉండటం విశేషం. 2018లో ప్రారంభమైన పనులు 2021 వరకు సాగాయి. దీని కింద మూడు కోట్ల అంచనాలతో పనులను చేపట్టారు. ఇందులో రెండు కోట్లకుపైగా నిధులను 2021 నాటికి ఖర్చు చేశారు. 95 శాతం పనులు పూర్తయినట్టు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. వంద శాతం పనులు పూర్తికాక ముందు చేసిన పనులు మొత్తం దెబ్బతినిపోయాయి. తూములు, పంట కాలువలతోపాటు, గట్టు పటిష్ట పరచడం వంటి పనులను చేపట్టారు. కాని ఏ ఒక్క పనీ నాణ్యత లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పంట కాలువలు కొత్తగా నిర్మించినప్పటికీ ఏడాదిలోపే ఎక్కడివక్కడ తెగిపోయాయి. దీంతో నీరంతా వరి మడుల్లోకి సైతం చేరుతోంది. గతేడాది ఈ రకంగా చేరి సుమారు 30 నుంచి 40 ఎకరాల భూమి నీటి మునిగింది. చెరువు మధ్య భాగంలోనున్న పట్నాల తూము పరిస్థితి ఇప్పటికీ దయనీయంగానే ఉండటం గమనార్హం. తూము పైభాగంలో చెరువు గట్టుకు గండిపడింది. దీన్ని ఇసుక మూటలతో కప్పిపెట్టారు. ఇప్పటి వరకు దీని మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడం కష్టతరంగా మారింది. గతేడాది అధికంగా నీరొచ్చి మరవ ఉధృతంగా మారింది. ఈ సమయంలో మరువ వద్ద స్లూయిస్ దెబ్బతిని గండి పడింది. ఈ గండిని ఈ సీజన్ సమయంలో నీరు లేని సమయంలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కాని దీనిమరమ్మతులపై దృష్టి సారించిన దాఖలాల్లేవు.

చెరువు నిర్వహణకు చర్యలు చేపట్టాలి

జిల్లాలోనే అతి పెద్ద చెరువు శింగనమల. దీని కింద పది గ్రామాలు ఆధారపడి ఉంటున్నాయి. ఇంత పెద్ద చెరువు నిర్వహణపై ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. పంట కాలువలు, చెరువు కట్ట భాగం పటిష్టతకు నిధులు విడుదల చేయాలి. గతంలో విడుదల చేసిన నిధుల వినియోగంపైనా విచారించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బాలరంగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

హెచ్ఎల్సీ కాలువకు గండి

కాలువకు గండిపడి బయటకు వస్తున్న నీరు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర జలాశయం నుంచి అనంతపురం జిల్లాకు నీటిని సరఫరా చేసే హెచ్ఎల్సీ కాలువకు అనంతపురం జిల్లా బొమ్మనహాల్‌లో గండిపడింది. బొమ్మనహల్ మండల పరిధిలోని నాగలాపురం సమీపంలో యూటీ 113వ కిలోమీటర్ వద్ద గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో గండిపడింది. దీంతో నీరు వృథాగా బయటకు వెళ్లింది. ప్రధాన కాలువపై గస్తీ తిరుగుతున్న లస్కర్లు దీనిని గుర్తించి నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి జెసిబిలతో మరమ్మతు పనులు చేపట్టారు. తుంగభద్ర జలాశయం అధికారులకు సమాచారం ఇచ్చి నీటి ప్రవాహాన్ని తగ్గించారు. రాత్రికిరాత్రే గండిని అధికారులు మట్టితో పూడ్చివేశారు. గండి చుట్టూ పెద్ద ఇసుక సంచులను ఏర్పాటు చేశారు. గండిని త్వరగా గుర్తించి దానిని తక్కువ సమయంలోనే పూడ్చివేయడం వల్ల నీటి వృథాను చాలా వరకు తగ్గించామని హెచ్ఎల్సి కణేకల్లు ఎడి మద్దిలేటి తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కాలువకు గండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

బొమ్మనహాల్ :శిథిలావస్థలో ఉన్న హెచ్ఎల్సీ కాలువ మరమ్మతులు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించడం వల్లనే దానికి గండిపడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. బొమ్మనహల్ మండలంలో గండిపడిన తుంగభద్ర ప్రధాన కాలువను సిపిఎం నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం పరిశీలించారు. కాలువ వెంబడి ఆయన పరిశీలన చేసి పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం రాంభూపాల్ విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లాకు సాగు తాగునీటిని అందించే ఏకైక ఆధారం తుంగభద్ర జలాలు అన్నారు. ఈ నీటిని కర్నాటక, ఆంధ్ర రాష్ట్రాలు సర్దుబాటు చేసుకోవాల్సి ఉందన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి నీటిని తీసుకునే హెచ్ఎల్సి కాలువ శిథిలావస్థకు చేరిందన్నారు. ఆంధ్రావాటాగా మూడు వేల క్యూసెక్కుల నీటిని తీసుకోవాల్సి ఉన్నా కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో కనీసం వెయ్యి క్యూసెక్కుల నీటిని తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. శుక్రవారం నాడు హెచ్ఎల్సీ 113వ కిలోమీటర్ వద్ద గండిపడి సాగునీరు వృథా అయ్యిందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న కాలువను మరమ్మతు చేయించాలని సిపిఎంతో పాటు ప్రజాసంఘాల పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానా ముఖ్యమంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యేలు స్పందించలేదన్నారు. మరమ్మతుల పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయి తప్పా, కాలువలు బలపడలేదన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ తుంగభద్ర కాలువ ఆధునీకరణపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడాలన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కాలువను పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. కాలువ పరిశీలన కోసం అవసరమైన పూర్తి స్థాయి సిబ్బందిని కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించకుంటే ఆగస్టు 14న జిల్లా సాగునీటి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, బాబురావు, ఆంజనేయులు, తిమ్మరాజు, శంకర్ పాల్గొన్నారు.

గండిపడిన కాలువను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

కార్మికుల సమస్యలపై పోరాటం

చలో విజయవాడ 24వ తేదీకి మార్పు - మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు

విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని దశలవారీగా రిలే దీక్షలు, మున్సిపల్ కార్యాలయాల ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 7న కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా జిల్లావ్యాప్తంగా కార్మికులందరూ అనంతపురంలోని సంఘమేష్ సర్కిల్ నుండి ర్యాలీగా కలెక్టరేట్ వరకూ వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించినట్లు తెలిపారు. కార్మికుల వీరోచిత పోరాటాలను గుర్తించిన మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయూస్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులను పిలిపించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీతో సరిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాగా అనివార్య కారణాల వల్ల ఈనెల17న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని 24వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు. కార్మికులు ఈ విషయాన్ని గమణించాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డిఆర్ఒ గాయత్రిదేవికి సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ట్రేడ్ యూనియన్ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.నాగభూషణ, నాయకులు రామాంజి, తిరుపాల్, ఐఎఫ్‌టియు నాయకులు ఉపేంద్ర, వైఎస్ఆర్‌టియు నాయకులు గోవిందు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం అలసత్వాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పరిష్కారం కోసం జేఏసి పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ నెల 19వ తేదీలోగా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే సరి, నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం డిఆర్ఒ గాయత్రిదేవిని కలిసి జెఎసి నాయకులు సమ్మె నోటీసు అందజేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర ప్రధాన కాలువకు పడిన గండిని పరిశీలిస్తున్న కాలవ శ్రీనివాసులు

మండల పరిధిలోని 113 కి.మీ వద్ద తుంగభద్ర ప్రధాన కాలువకు గండి పడింది. దీంతో శుక్రవారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు గండి పడిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలవ విలేకరుల తో మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు గానీ, జిల్లాకు ప్రధాన నీటి వనరు అయిన హెచ్ఎల్‌సి కాలువకు రూపాయి కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఈ కాలువపై ఆధారపడి లక్షలా ది మంది రైతులు పంటలు సాగు చేస్తుండగా సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బొమ్మనహాల్, కణేకల్లు, డి.హీరేహాల్ మండలాల్లో ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే గండిని పూడ్చడంతో పాటు కాలువ మరమ్మతులు చేపట్టాని డిమాండ్ చేశారు. కాలవ వెంట టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తే ఉపయోగం

జాతీయ వ్యవసాయ నిర్వహణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు

శిక్షణ తీసుకున్న రైతులతో శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జాతీయ వ్యవసాయ నిర్వహణ సంస్థ డైరెక్టర్ చెరుకుపల్లి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో సమగ్ర మెట్ట వ్యవసాయం-వాతావరణ సానుకూలం.. యాజమాన్య పద్ధతులపై కూడేరు మండలం చోళసముద్రం, కరుట్లపల్లి, ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం ఎస్సీ రైతులకు మూడు రోజుల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా వ్యవసాయంలో రెట్టింపు ఆదాయం సాధించేందుకు వర్షం నీటి యాజమాన్యం, భూసారాన్ని పెంపొందించడం, మేలైన రకాలను సాగు చేయడం, నీటి కుంటలు తవ్వించుకుని బెట్ట పరిస్థితులను ఎదుర్కోవడం, చిరుధాన్యాలు సాగు చేయడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. ముఖ్యంగా రైతులు చిరుధాన్యాలపై మక్కువ చూపాలన్నారు. అనంతరం సమగ్ర మెట్ట వ్యవసాయం వాతావరణ సానుకూల యాజమాన్య పద్ధతులపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ బి.సహదేవరెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఆత్మ) మద్దిలేటి, పశువిజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసనాయక్, ఉద్యాన ఉద్యానవన పరిశోధన స్థానం అనంతపురం అధిపతి డాక్టర్ సుబ్రమణ్యం, శాస్త్రవేత్తలు డాక్టర్ సుప్రియ, శాస్త్రవేత్త కెసి.నటరాజ్, పి.రాధిక, సివి.చంద్రమోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్, వెంకటరమణ, డివి శ్రీనివాస్, శశికళ, యాస్మిన్, రామసుబ్బయ్య, కిషోర్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సహాయనిధితో రైతులను ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-రాయదుర్గం

వ్యవసాయంలో అన్ని విధాలా నష్టపోయిన అనంతపురం జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక సహాయ నిధిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు రాయదుర్గం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రధాన పంట వేరుశనగను పూర్తిస్థాయిలో రైతులు విత్తలేదన్నారు. అధికారుల అంచనా ప్రకారం 9.16 లక్షల ఎకరాల్లో పంట సాగు ఉంటుందని అంచనా వేయగా, ఐదు లక్షల ఎకరాల్లోపే సాగు విస్తీరణం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి అరకొర సాయం లభిస్తోందన్నారు. పంట పండినా గిట్టుబాటు ధర లేక నష్టాలు వస్తున్నాయని చెప్పారు. వేరుశనగే కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు కూడా పెరగలేదన్నారు. ఆముదం, కందులు ప్రభుత్వం ఇచ్చినప్పటికీ అది రైతాంగాన్ని ఆదుకునే చర్య కాదన్నారు. జిల్లాకు చెందిన శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలో పంట సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి రైతుల కోసం ప్రత్యేక సహాయ నిధిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ వల్ల జిల్లాలో కొంత విస్తీర్ణంలో పంట సాగు అవుతున్నప్పటికీ ఆధునికరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం వల్ల జిల్లాకు రావాల్సిన న్యాయమైన నీటి కోటాను వాడుకోలేకపోతున్నట్లు చెప్పారు. దీర్ఘకాలంగా ఎగువ కాలువ ఆధునీకరణ పనులు కొనసాగడం లేదన్నారు. దీనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో ఇటు ఖరీఫ్‌లో పంట సాగు, అటు తుంగభద్ర ఎగువ కాలువ ద్వారా జిల్లాకు రావాల్సినన సాగునీటి కోటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోవడం వల్ల జిల్లా రైతాంగానికి అన్ని విధాల అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు అవుతున్నప్పటికీ చేసిన పనికి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. అనంతపురం జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 18 కోట్ల రూపాయల బిల్లు బకాయిలు ఇంకా కూలీలకు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు మొత్తాన్ని చెల్లించకపోవడం వల్ల బకాయిలు అలాగే ఉన్నాయన్నారు. వెంటనే పెండింగ్ ఉపాధి బిల్లులు అన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక అనంతపురంలో గురువారం ఓ కార్పొరేటర్ తన అనుచరులకు మద్దతుగా 'సెబ్' కార్యాలయంలో పోలీసు సిబ్బందిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీసులు నిందితులపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, సంగమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కరువు నివారణ ప్రణాళికలు సిద్ధం చేయండి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అధికారులతో మాట్లాడుతున్న జెసి కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

వర్షాభావం, కరువు సంక్షోభ నివారణకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఖేతన్‌గార్గ్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కరువు, సంక్షోభం నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీన్ని అధిగమించేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖలు కరువు ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ ద్వారా వరి పంట కాకుండా తక్కువ నీటితో పండే రాగి, కొర్ర, జొన్న, ఇతర పంటల సాగుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, సిపిఒ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ, సూక్ష్మ, భారీ నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఐసిడిఎస్ పీడీ, భూగర్భ జల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించాలి

డ్వామా అధికారులకు వ్యకాసం నేతల వినతి

డ్వామా అధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులు చేసిన పనులకు బకాయి పడ్డ బిల్లులు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డ్వామా అధికారులను కలిసి బకాయి బిల్లులు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రూ.19 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. తక్షణమే చెల్లించాలని కోరారు. 200 రోజులు పనులు కల్పించాలన్నారు. రోజు కూలీ రూ.600 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.భాస్కర్, నాయకులు వీరనాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో సాధన చేస్తే విజయం తథ్యం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

ఉద్యోగం తప్పకుండా సాధిస్తామనే దృఢ సంకల్పంతో సాధన చేస్తే విజయం తథ్యమని ఎస్పీ కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ అర్హత అభ్యర్థులకు జిల్లా పోలీసు శాఖ సుశిక్షితులైన పోలీసు సిబ్బందితో ఈవెంట్స్ ప్రాక్టీస్ చేయిస్తున్న విషయం తెలిసిందే. స్థానిక పరేడ్ మైదానంలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో ఎస్పీ శుక్రవారం ముఖాముఖి మాట్లాడారు. ఇందులో భాగంగా లక్ష్యం ఎలా చేరాలి, కఠోర శ్రమ, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లి ఎలా ఉద్యోగం సాధించవచ్చో దిశానిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న ఈవెంట్స్‌లో ఎలా సక్సెస్ కావచ్చో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పరేడ్ సాధనను పర్యవేక్షించిన ఎస్పీ

సాయుధ బలగాలతో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఈనెల 15న నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకలకు సాయుధ బలగాలు సాధన చేస్తున్నాయి. ఇందులో భాగంగా సాయుధ బలగాలు చేస్తున్న సాధనను ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం పర్యవేక్షించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లివిరిసేలా, నలుదిశలా వ్యాపించేలా పరేడ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, ఆర్ఐలు హరికృష్ణ, శివరాముడు, పలువురు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రైతాంగం అభివృద్ధికి కృషి : ఎఒ

ఉరవకొండ : వ్యవసాయ అధికారులు శిక్షణ తీసుకోవడం ద్వారా రైతాంగ అభివృద్ధికి కృషి చేయవచ్చని ఎఒ నవత అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ అగ్రి ల్యాబ్‌లో ల్యాబ్ ఎఒ శేఖర్ ఆధ్వర్యంలో 6వ రోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా రసాయన ఎరువుల్లో ఎలాంటి పోషకాలు ఉంటాయి.. వాటి ప్రయోజనాలు.. ఉపయోగించడం ద్వారా రైతులకు వచ్చే ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా ఎరువులను పరీక్షించే విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఎరువుల వాడకంలో అజాగ్రత్తగా ఉండకుండా రైతులు అప్రమత్తంగా ఉండేలా ప్రయోగ పరీక్షలు నిర్వహించిన తర్వాతే వాడే విధంగా రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మంజులత, గీతావాణి, శ్రీనాథ్, ఎఇఒలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడనున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.శ్రీకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులిగుట్ట సబ్‌స్టేషన్ (33/11కెవి)లో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మున్సిపాలిటీతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

గుత్తి : ఓటరు జాబితా విచారణ పగడ్బందీగా చేపట్టాలని తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా ఆదేశించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో బిఎల్‌ఒలు చేపట్టిన ఓటర్ల విచారణను తహశీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు ఓటర్ల విచారణను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒ కె.అనిత, 17వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఎస్ఎం.బాషా, బూత్ లెవెల్ అధ్యక్షుడు నబిరసూల్ పాల్గొన్నారు.

21వ తేదీలోపు ఓటరు సర్వే పూర్తి చేయాలి

బుక్కరాయసముద్రం : కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీలోపు ఇంటింటి ఓటరు సర్వే పూర్తి చేయాలని తహశీల్దార్ రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు కలిసి 11, 12, 13వ తేదీల్లో వారికి అప్పగించిన పని పూర్తి చేయాలన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

గార్లదిన్నె : ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, అలసంద, పెసర, కొర్ర విత్తనాల కోసం ఆయా రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల కోసం కోసం రైతులు ఈనెల 14 తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేరు నమోదు చేసుకున్న రైతులకు సామాజిక తనిఖీ నిర్వహించిన తర్వాత 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు.

గోదాము నిర్మాణానికి భూమిపూజ

శింగనమల : మండలంలోని కల్లుమడి గ్రామంలో రైతుమిత్ర గొడౌన్ నిర్మాణానికి డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. గొడౌన్ నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, వైసిపి నాయకులు చిన్నికృష్ణారెడ్డి, సర్పంచి గవ్వల పక్కీరమ్మ, సాకే కొండయ్య, చెన్నకేశవులుయాదవ్, పత్తి లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, గవ్వల నల్లప్ప, సుంకిరెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

2, 3 రోజుల్లో హంద్రీనీవా నీరు విడుదల : ఎమ్మెల్సీ

ఉరవకొండ : రాబోయే రెండు, మూడు రోజుల్లో హంద్రీనీవా సుజల స్రవంతి కెనాల్‌కు నీరు విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్సీ హంద్రీనీవా సుజల స్రవంతి కెనాల్‌కు నీటి విడుదలకు జాప్యం చేయడంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులు స్పందిస్తూ నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ విన్నపం మేరకు నేటి నుంచి నీటి పంపింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో జిల్లాకు నీరు చేరనున్నట్లు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

పుట్లూరు : మండలంలోని పంచాయతీల్లో వార్డు మెంబర్లకు నిర్వహించనున్న ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఈమేరకు మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామం పంచాయతీ 1వ వార్డు మెంబర్‌కు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేయగా శుక్రవారం నిర్వహించిన ఉపసంహరణలో ముగ్గురివీ సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి యలమనాయుడు ప్రకటించారు.

మైకులు వితరణ

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బైసాని మాధవి తన భర్త పురుషోత్తమగుప్తా జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.25వేలు విలువజేసే అహూజా మైకును వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను సత్కరించి అభినందించారు.

21 నుంచి రాష్ట్ర మహాసభలు

ఉరవకొండ : ఈనెల 21, 22వ తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎపి ఎన్‌జిఒ ఉరవకొండ తాలూకా అధ్యక్షులు శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ తాలూకా కార్యదర్శి జగన్నాథ్, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, ట్రెజరర్ శివయ్య, యూనియన్ నాయకులు ఎస్‌టిఒ నాగేంద్రబాబు, నిమ్మల వెంకటేశులు, మోతీలాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమంలో ఉప సర్పంచి కాసా చంద్రమోహన్ భార్య కాసా సుశీలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం అన్నదారం చేశారు. ఈ కార్యక్రమంలో కుమారుడు కాసా ప్రశాంత్, కోడలు ఉషారాణి, మనవడు జస్విన్, కుమార్తె జ్యోతి, అల్లుడు రాఘవ, మనవరాలు రాదిత్య రాపేక్ష, తదితరులు పాల్గొన్నారు.

బిసి గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కుందుర్పి : మండల పరిధిలోని అల్లాపురం-ఎర్రగుంట సరిహద్దు ప్రాంతంలో బిసి గురుకుల పాఠశాల స్థలాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచులు విశాలాక్షి, మారుతీశ్వరిరామ్మూర్తి మాట్లా డుతూ బిసి గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం మంత్రి ఉషశ్రీచరణ్ ప్రభుత్వం నుంచి రూ. 25 కోట్లు విడు దల చేయించారన్నారు. అయితే స్థలం కోసం ఇబ్బందులు పడుతుండగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుందు ర్పికి చెందిన బోయ లక్ష్మీదేవి, జిన్నా ఓబులేసు కుటుంబ సభ్యులు 5.3 ఎకరాల భూమిని దానం ఇవ్వడం గర్వించదగ్గ విష యం అన్నారు. మాజీ జడ్పిటిసి రాజగోపాల్ 1 ఎకరా భూమి ఇస్తానన్నారు. అల్లాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 1 ఎకరా భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సర్పంచి తెలిపారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో తహశీల్దార్ విజయ్‌కుమారి, డిప్యూటీ తహశీల్దార్ కుళ్లాయప్ప, సింగిల్‌విండో ఛైర్మన్ ఎఆర్ వన్నూర్‌రెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ లక్ష్మణమూర్తి, మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ఉండాలి



సిరా గుర్తు చూపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

అనంతపురం : విద్యార్థులు ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం కె.సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఓటుహక్కుకు ఉన్న ప్రాముఖ్యత, మేనిఫెస్టో అంటే ఏంటో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసు, డీన్లు మహేష్, అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఎఒ గోపాల్, పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి విధానం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రోడ్డు పనులున పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

నగరంలో దౌర్జన్యాలు, దాడులు చేయడం టిడిపి నైజం అయితే.. అభివృద్ధి, సంక్షేమమే వైసిపి విధానం అని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శుక్రవారం నగరంలోని 38వ డివిజన్ పరిధిలో రూ.21 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అంతర్గత రహదారులతోపాటు డ్రెయినేజీ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. టిడిపి సమయంలో కేవలం శిలాఫలకాలు, జీవోలకు మాత్రమే పరిమితమైతే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. సిఎం జగన్ సహకారంతో రూ.25 కోట్ల నిధులను నగరాభివృద్ధికి తీసుకొచ్చామన్నారు. అదేవిధంగా గడప గడపకూలో ప్రజలు తీసుకొస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికీ రూ.20లక్షల చొప్పున నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. నేడు నగరంలో ప్రతి డివిజన్ పరిధిలోని దాదాపు రూ.2కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి సొంత డివిజన్‌లో కూడా రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వర్షం వస్తే రాంనగర్, కొవూర్‌నగర్‌లోని కాలనీలు నీటితో నిండిపోయేవన్నారు. ఆ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా స్పెషల్ గ్రాంట్ నిధులతో డ్రెయినేజీలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, డిఇ రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయంలో ముగిసిన ఆడిట్

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

అనంతపురం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గత సోమవారం నుంచి జరుగుతున్న ఇంటర్నల్ ఆడిట్ శుక్రవారం ముగిసింది. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం లోని ఆడిట్ విభాగం ఏవో రామశేషకుమార్, సీఏఓ బాల వీరయ్య ఐదు రోజులుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అన్ని విభాగంలోని ఫైనాన్స్ కు సంబంధించి ఇంటర్నల్ ఆడిట్ చేయడం జరిగింది. శుక్రవారం సి ఈ ఓ వెంకటసుబ్బమ్మ జిల్లాకు రావడంతో డిఈఓ ఎం. సాయిరామ్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. సీఈవో ఫైనాన్స్ కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసి గోవింద నాయక్, ఏడీలు నాగరాజు, కష్ణయ్య, పరవేక్షకులు శ్రీనాథ్, ఆదినారాయణ, సరళ కుమారి, డిసిఈబి సెక్రెటరీ పురుషోత్తం బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆశావాది శశాంకమౌళి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.విష్ణుప్రియ, పి.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దూద్‌పీరా, హరి, రూపానంద, రాజీ, గౌతం, అశ్విని, దివ్యశ్రీ, అజయ్, నవీన్, తుకారామ్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన దేవుని ఉప్పలపాడు సర్పంచి అభ్యర్థి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

సర్పంచి కాటమయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

మండలం పరిధిలోని దేవునిఉప్పలపాడు సర్పంచిగా ఎన్నికైన కేశగాని కాటమయ్య శుక్రవారం ఎమ్మెల్యే పెద్దారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇక్కడ సర్పంచిగా ఎన్నికైన రామ్మోహన్ మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈనేపథ్యంలో ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో స్థానిక నాయకులు సర్పంచి అభ్యర్థిగా కాటమయ్యను ఎంపిక చేశారు. దీంతో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సర్పంచిగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యేతోపాటు జడ్పిటిసి రమాదేవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడిమి సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీ పక్కన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూన్నెల్లలో నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. 11కెవి, 33 కెవి విద్యుత్ లైన్లను అనుసంధానం చేయడం వల్ల కొడిమి, రాచానపల్లి, నరసనాయనికుంట, నాగిరెడ్డిపల్లి, నారాయణపురం గ్రామాల్లో రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న కాలనీలో నిర్మాణమయ్యే 6,500 ఇళ్లకు విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ఈ సబ్‌స్టేషన్ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఉప్పరపల్లి, కుంటిమద్ది, మేడాపురంలోనూ సబ్‌స్టేషన్లు నిర్మాణ దశల్లో ఉన్నాయి. తోపుదుర్తి, గొరిదిండ్లలో కూడా సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు.

టిడిపి కార్యకర్తలకు పరామర్శ

శింగనమల : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నాగులగుడ్డం తండాకు చెందిన టిడిపి కార్యకర్త శ్రీనానాయక్, రామచంద్రనాయక్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున అందజేశారు. ఈకార్యక్రమంలో దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణంతో మూగబోయిన పీడితుల గొంతు

గుంతకల్లు : ప్రజా కళాకారుడు, వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్ మరణంతో పీడిత ప్రజల గొంతు మూగబోయిందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక భగత్‌సింగ్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ గద్దర్ రాష్ట్రవ్యాప్తంగా తన విప్లవ పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులుగా చేస్తూ అండగా నిలిచారన్నారు. ముఖ్యంగా కారంచేడు, చుండూరు దళితులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, రామాంజనేయులు, పిఓడబ్ల్యు నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ, ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, దేవేంద్ర, జిలాన్, సత్తార్, గోపీ, షేక్షావలి, నారాయణ, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి-బెలుగుప్ప

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు అన్ని చెరువులకూ నీరందిస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా చేసింది ఏమీ లేదన్నారు. 2024 మార్చిలోగా మండలంలో హనుమిరెడ్డిపల్లి, కాలువపల్లి కోనాపురం, గంగవరం చెరువులకు నీళ్లు ఇవ్వగలరా.. అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో కోనాపురం గ్రామంలో టిడిపి సానుభూతిపరులు ఎక్కువగా ఉన్నారని భావించి నీళ్లిస్తామని చెబుతున్నాడన్నారు. మీ మాటలను ప్రజలు నమ్మో స్థితిలో లేరన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ హంద్రీనీవా 36 ప్యాకేజీ కింద రూ.350 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. ఆ నిధులతోనే శ్రీరంగాపురం, బ్రాహ్మణపల్లి చెరువులకు కాలువ పనులు యుద్ధ ప్రాతిపదకన పనులు చేస్తుండగా వైసిపి నాయకులు కోర్టుకు వెళ్లి నిలిపివేయించారని ఆరోపించారు. ఇకపోతే వైసిపి నాయకులు అధికారులను అడ్డుపెట్టుకుని టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ ప్రసాద్, ఆవులన్న సర్పంచి రామ్మోహన్, జిల్లా నాయకుల పెద్ద తిప్పయ్య, విజయ్, అర్జున్‌రెడ్డి, వెంకటేశులు, తిప్పేస్వామి, నాగభూషణ, వలి, వన్నూరుస్వామి, శ్రీరాములు, నాగేంద్ర, బైన నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

40శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్స్

అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చే అక్టోబర్‌లో 40 శాతం రాయితీతో రైతులకు కిసాన్ డ్రోన్స్ పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అనంతపురం డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక అనంత కృషి భవన్‌లో ఛైర్మన్ ఆలమరు సుబ్బారెడ్డి అధ్యక్షతన అనంతపురం రూరల్ మండలం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా మండలాల్లోని ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తనాలు ఉలవలు, పెసలు, కొర్రలు, మినుములు 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, మండల వ్యవసాయధికారిణి జె.శశికళ, పశు వైద్యాధికారిణి ఉషా, వ్యవసాయ విస్తరణాధికారులు మురళీకృష్ణ, అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు, వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల లభ్యత, కౌలు రైతులకు కౌలు అర్హత కార్డులు ఇప్పించి పంట రుణాలు ఇప్పించే విషయాలపై చర్చించారు.

CHANGE OF NAME

I, PARHANA BANU PATAN @ PARHANA KHANAM MOGHUL (Old Name) W/o MOGHUL SIKINDAR KHAN residing at 13-3-656, Khaja Nagar, Anantapur,-515001, Anantapur Dist. AP. Changing my name from PARHANA BANU PATAN @ PARHANA KHANAM MOGHUL to FARHANA KHANAM MOGHUL (New Name). Hence for, I am being called as FARHANA KHANAM MOGHUL for all purposes.

In the court of Prl. Junior civil Judge, Anantapuramu.
O. S. No. 904/2022

Between:
Smt.Suneetha ponnaluru D/o.Late Vankadari Nagabhushanam, Residing at door no.261, Meadow Beauty, DR Apex, NC -27539, USA.
...plaintiff

And

1)Ponuganti Rajeswari, W/o.Late Vankadari Nagabhushanam, H. No. 21/278, Brahmin street, old town, Anantapuramu.
2)Vankadari Nagaraju, S/o. V. Nagabhushanam, 8A//9, Mithilum, DABC, Sriram Nagar main Road, Nolambur, Chennai-600095.
3)Vankadari Phaniraju, S/o. V. Nagabhushanam, 8710, 236th Avenue, Redmond, WA-98053, USA.
...defendants

పై దావాలో రెండోవ ప్రతివాది అయిన వంకదారి నాగరాజు కోర్టులో 13/09/2023వ తేదిన హాజరు అగుట కొరకు కోర్టు ఉత్తర్వులు చేసినది. ఆ తేదిన వారు కానీ వారి తరుపు వకీలు గానీ కోర్టుకు హాజరు కావలెను. లేని యెడల వారి పరోక్షములో కోర్టు తీర్పు ఇవ్వబడును.

(By court order)
Sri. T. Ramachandra Gupta,
advocate, anantapuramu.cell no. 6304622428.

మహిళలపై దాడులు అమానుషం

రౌండ్‌టేబుల్ సమావేశంలో మహిళా నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయని, దాడులు జరుగుతుండటం అమానుషంగా ఉందని వివిధ రాజకీయ పార్టీల మహిళా నాయకులు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో వివిధ పార్టీల మహిళల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచకం తాండవిస్తోందని, ఎక్కడ చూసినా మహిళలపై దౌర్జన్యాలు వేధింపులు పెరిగిపోయని తెలిపారు. మహిళలకు రక్షణ కరువైందని, దిశా చట్టం పేరుకు మాత్రమే ఉందన్నారు. నగరం నడిబొడ్డున సెబ్ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా కానిస్టేబుల్‌పై వైసిపి నాయకులు దాడి చేస్తే, ప్రభుత్వం, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తేజస్విని, టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, సిపిఐ నాయకురాలు పద్మావతి, బిజెపి పార్లమెంట్ అధ్యక్షురాలు చంద్రకళ, బిజెపి జనరల్ సెక్రటరీ విశాలరెడ్డి, మనోహక్కుల సంఘం సభ్యురాలు బుజ్జి, తెలుగు మహిళలు జానకి, వసుంధర, టిడిపి నాయకులు దలవాయి రమాదేవి, వెంకట లక్ష్మి, వరలక్ష్మి, సుజాత, కవిత, శోభా, శంకరమ్మ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేయాలి

మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి

దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేద్దామని మలేరియా ఉరవకొండ సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా విడపనకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వైద్యాధికారి శ్రీధర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అప్రమత్తంగా ఉండి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం ల్యాబ్‌లను పరిశీలించి టెక్నీషియన్లకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లేపల్లిలో 'గడప గడపకూ'

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని పల్లేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండయ్య, జడ్పిటిసి మల్లికార్జున, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి గౌని నాగరాజురెడ్డి, వైసిపి నాయకులు మాధవరెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, మల్లాపురం చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

ప్రజాశక్తి-అనంతపురం

మొక్క నాటి నీరు పోస్తున్న జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్

మానవాళి మనుగడకు విరివిగా మొక్కలన నాటి సంరక్షణ చేయాలని జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవాసమితి ఆధ్వర్యంలో అజాది కా అమృత మహోత్సవంలో భాగంగా క్యాంపస్‌లోని అమరావతి హాస్టల్ దగ్గర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ చెట్లు పెంచి పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలో కరువును రూపుమాపాలంటే ఏకైక మార్గం మొక్కలను పెంచడం అన్నారు. భవిష్యత్తులో వీలైనన్ని ఎక్కువ చెట్లు నాటి విశ్వవిద్యాలయాన్ని 'గ్రీన్ క్యాంపస్'గా మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా జి.మమత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్లు విష్ణువర్ధన్, ఎం.అంకారావు, చంద్రమోహన్‌రెడ్డి, ఎం.రామశేఖరరెడ్డి, కెఎఫ్.భారతి, అజిత, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : 'నా భూమి.. నా దేశం.. నా నేలతల్లి.. వంటి నినాదాలతో దేశ నాయకులను స్మరించుకోవడం హర్షించదగ్గ విషయమని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతారాణి రామాంజనేయులు అన్నారు. అమృత మహోత్సవంలో భాగంగా శుక్రవారం విడపనకల్ మండల పరిధిలోని గడేకల్లు, కొట్టాలపల్లి, హావళిగ, హంచనహాల్, చీకులగురికి, మాలాపురం, పాల్తూరు, వి.కొత్తకోట గ్రామాల్లో నాభూమి-నాదేశం.. నా నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, గీతమ్మ, సుశీల, ఉమాశంకర్, పార్వతి కేశన్న, పంచాయతీ సెక్రటరీ అబ్దుల్ మునాఫ్, మార్కెట్ల డైరెక్టర్ హేమావతి, సచివాలయ కన్వీనర్లు మస్తాన్, లక్ష్మన్న, కేసన్న, రామాంజనేయులు, కేశన్న, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు ఓబుళప్ప, ప్రకాష్‌గౌడ్, ఓబులేసు, వీరప్ప, మోదుపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బొందలవాడలో ఉపసర్పంచి ఆలం వెంకటనరసానాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, ఎన్ఆర్‌జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, అనంతపురం మాజీ మార్కెట్ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, సర్పంచి మన్నిల సుప్రియ, స్కూల్ కమిటీ ఛైర్మన్ శ్రీధర్, గవ్వల సాయికృష్ణ, చికెన్ గోపాల్, వేదాంతం మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ శివకృష్ణ, మజ్జిగ శివశంకర్, ఉపాధి సిబ్బంది, స్కూల్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవనప్రమాణాలు మెరుగుపరచడానికే సున్నా వడ్డీ రుణాలు

బత్తలపల్లిలో మెగా చెక్కు అందజేత

ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకిస్తున్న 'పురం' నాయకులు,అధికారులు

కదిరిలో మంజూరుపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి బత్తలపల్లి

మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికే ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలను అందజేస్తోందని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సున్నా వడ్డీ నాలుగో విడత మెగా చెక్ పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలు బ్యాంకులలో రుణాలు పొంది వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అనంతరం మండలంలోని 806 మహిళ సంఘాలకు చెందిన 8567 మంది సభ్యులకు రు.1,21,85,744 రూపాయల విలువైన మెగా చెక్కును అందజేశారు. అంతకుమునుపు ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సౌజన్యకుమారి, ఎపిఎం సుదర్శన్ రాజు, మండల సమాఖ్య ప్రతినిధులు ఎల్సీ లక్ష్మీనారాయణ, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, నాగనంద్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘంలో మహిళాలకు నాలుగు సంవత్సరాల్లో రూ.12.49 కోట్లు లబ్ది చేకూరిందని వైసిపి సమన్వయ కర్త, ఇన్చార్జ్ దీపిక అన్నారు. స్వయం సహాయక సంఘాలకు 4 వ విడత వైయస్సార్ సున్నా వడ్డీ నిధులు పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం నాలుగు సంవత్సరాలకు హిందూపురం పురపాలక సంఘంలో సున్నా వడ్డీ క్రింద రూ.12.49 కోట్లు మంజూరు అయిందన్నారు. త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెగా చెక్కును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి జబివుల్లా,కౌన్సిలర్లు శివ, ఆసిఫ్, షాజియా, పార్వతీ నాగరాజు, గిరి, మల్లికార్జున, మణి, నాగరాజు, మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీ కి చెందిన 10 వ వార్డు సచివాలయ పరిధిలోని మహిళ స్వయం సహాయక గ్రూపులకు వైస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగవ విడత పంపిణీని శుక్రవారం చేపట్టారు. ఆ వార్డు కౌన్సిలర్ కె ఎస్ దిల్షాదున్నిసా, వైసిపి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బహావుద్దీన్ లబ్ది దారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎడ్యుకేషన్ సెక్రెటరీ కార్తీక్, ఆర్పిలు ఖురాన్, తస్లీమా, గ్రూపు లీడర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : డ్వాక్రా మహిళలకు చెందిన బ్యాంక్ రుణాలకు వైయస్సార్ సున్నా వడ్డీ మొత్తాన్ని మహిళ సంఘాల రుణ ఖాతాలకు జమ చేసినట్లు ఏపీఎం రమణప్ప తెలిపారు.మండలానికి చెందిన 1078 మహిళా సంఘాల్లోని 11516 మందికి రూ.1,42,14,206లు విడుదల అయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత ఉద్యోగులు

అన్యాయాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం

హిందూపురం : పవర్ జెఎసి, విద్యుత్ మేనేజ్మెంట్తో బుధవారం జరిపిన చర్చల్లో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంట్రాక్టు ఉద్యోగులు అన్నారు. ఈ అన్యాయాన్ని నిరసిస్తు శుక్రవారం పవర్ జెఎసి దిష్టి బొమ్మతో ర్యాలీ నిర్వహించి, డీఈ కార్యాలయ ఆవరణంలో ఉన్న 220కెవి సబ్ స్టేషన్ వద్ద దహనం చేశారు. తమకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ నాగరాజు, బలరాం, శ్రీనివాసులు, శ్రీనాథ్, నిరంజన్తో పాటు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించాలి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ సెక్రటరీలు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. పట్టణంలోని సప్తగిరి కళాశాలలో సెక్రటరీలకు డిజిటల్, సోషల్ మీడియా అవేర్నెస్ కార్యక్రమంతో పాటు స్థిరమైన లక్ష్యాలు, కీలక పనితీరు సూచికలు, సేవా నిబంధనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను ప్రతి ఒక్కరు పాటిస్తు, సమస్యలపై వెంటనే స్పందించి, ప్రజలకు మంచి సేవలను అందించాలన్నారు.

శిక్షణ వివరాలను వెల్లడిస్తున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

తలుపుల : ప్రయివేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని స్థానిక ప్రభుత్వ ఉన్నతా పాఠశాల హెచ్ఎం శంకరన్న పేర్కొన్నారు. స్థానిక గవర్నమెంట్ హై స్కూల్లో శుక్రవారం పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన గురించి వివరించారు. ఇదే పాఠశాలలో చదువుకున్న వారు ఎలాంటి ఉన్నత పదవులు అధిరోహించారో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షఫీ, రమేష్ బాబు, తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని అమగొండపాలెం, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు పరిశీలించి వివిధ ప్రశ్నలను విద్యార్థులను అడిగి సమాధానాలు రాబట్టారు. గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు శివకుమార్, గ్రీన్ భారత్ సంస్థ అధ్యక్షులు శంకరనారాయణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

హిందూపురం : సీజనల్ వ్యాధులపై పురపాలక సంఘ వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, హెల్త్ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యలయంలో సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఇన్ఛార్జిమంత్రి, ఎమ్మెల్యేతో స్థానిక నాయకులు

ఇన్ఛార్జి మంత్రిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ఇన్ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాంను మండల వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, మాజీ మండల కన్వీనర్ గంగాధర్, శ్రీనివాసులు, కప్పల బండ నారాయణస్వామి మార్లపల్లి శేషాద్రి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వాటిని పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా ఇన్ఛార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను స్థానిక వైసిపి నాయకులు కలిశారు.ఈ మేరకు మంత్రి పుట్టపర్తికి శుక్రవారం వచ్చిన నేపథ్యంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుండి నిధులు తెప్పించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - హిందూపురం

ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్ చార్జ్ దీపిక అన్నారు. శుక్రవారం రూరల్ మండలంకొటిపి వీరంపల్లి, ఇస్లాంపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు మధుమతి రెడ్డి, స్థానిక సర్పంచి కె సరస్వతి, ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు షాజియా, మణి, నాగరాజు, ఎంపీటీసీ ధనుంజయ రెడ్డి, మంజుళ, వార్డు ఇన్ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దీపిక వేణు రెడ్డి

మహిళా సాధికారతే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహిళా నాయకులు

మహిళలను సంపన్నం చేస్తూ మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని పెనుకొండ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే బి కే పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగినేని చెరువు, భూసాయ్యగారి పల్లి గ్రామాల్లోశుక్రవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పార్థసా రథి భార్య కమలమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయమ్మ, టిడిపి రాష్ట్ర అంగన్వాడి ఉపాధ్యక్షులు నాగమణి, తదితరులు ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మహిళలను సంపన్నులు చేయడం మహిళా సాధికారతే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు కషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప, పార్లమెంట్ కార్యదర్శి చంద్రశేఖర్, భాను కీర్తి, సంజీవరెడ్డి, డివి ఆంజనేయులు, ఆశ్వర్థ, సూరి, కిష్ట తదితరు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

రాగి పంట సాగును పెంచండి

వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలో రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. స్థానిక ఎఓ కార్యాలయంలో శుక్రవారం ప్రభాకర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ను పకడ్బందీగా చేయాలన్నారు. రాగి కనీస మద్దతు ధర రూ. 3,846 ఉందని, ఆర్బికెలలో సబ్సిడీపై రాగులు అందజేస్తారని కావున రైతులు రాగి పంటను సాగు చేయాలని కోరారు. హిందూపురం డివిజన్లో మండలానికి 3 కిసాన్ డ్రోన్స్ చొప్పున లక్ష్యం పెట్టారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్బికె సిబ్బంది రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖలోని పథకాలను తెలియజేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారి కిషోర్, విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎఇ నాగరత్న, పట్టు పరిశ్రమ శాఖ అధికారి శంకర్ నాయక్ వారి శాఖల్లో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఓ శ్రీలత, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు, విస్తరణ అధికారులు, ఆర్బికె సిబ్బంది పాల్గొన్నారు.

అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులు

సోషల్ ఆడిట్లో బోగస్కి ఆస్కారం ఇవ్వరాదు : పిఆర్ ఆర్డీ కమిషనర్ ఏ.సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం కింద డిమాండ్కు అనుగుణంగా అడిగిన వెంటనే పని కల్పించాలని పీఆర్ ఆర్డీ కమిషనర్ ఏ.సూర్యకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఏపీడీలు, ఏపీవోలతో కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అత్యంత ముఖ్యమైనదన్నారు. ఉపాధి హామీ కింద ఒక కార్యక్రమం చేపడితే దీర్ఘకాలం ఉపయోగముండేలా చూడాలన్నారు. పేదరికం పోగొట్టేలా, జీవనోపాదులు ఎలా పెంచాలో చూడాలని, ఈ విషయమై అధికారులు మనసుపెట్టి బాధ్యతగా పనిచేయాలన్నారు. అధికారులకు కేటాయించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని, లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలన్నారు. మంజూరు చేసిన జాబ్ కార్డులకు డిమాండుకు తగిన విధంగా కూలీలకు పని కల్పించాలన్నారు. వాటర్ షెడ్, లైవ్లీ వుడ్, హార్టికల్చర్ ద్వారా రైతుకు తన పొలం మీద వచ్చే దిగుబడి పెంచాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా రోడ్డు వేస్తున్నామంటే దాని ద్వారా ఎటువంటి ఉపయోగం ఉంది అనేది గుర్తించి ఉపయోగపడేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కింద ఏదైనా ఒక పని జరిగితే అది జీవనోపాధి పెంపొందించేలా, పేదరికం పోగొట్టేలా ఉండాలని, అందరికీ ఉపయోగపడేలా పనులు చేపట్టాలన్నారు. జాబ్ కార్డులున్న కుటుంబానికి వంద రోజులకు పైగా పనులు కల్పించాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ అధికారులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనులు చేపట్టాలంటే గ్రామ సభ పెట్టి రెజ్యులేషన్ తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు మండల అభివద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టాలని, గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏ అవసరాలు ఉన్నాయి, ఏ విధమైన అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాము, తదితర అంశాలపై ఎంపీడీవోల చేతిలో బ్లూ ప్రింట్ అనేది సిద్ధంగా ఉండాలని, అప్పుడే అభివద్ధి పనులు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చేపట్టే సోషల్ ఆడిట్లో బోగస్కి ఎలాంటి ఆస్కారం ఇవ్వరాదని, పక్కాగా చేపట్టాలన్నారు. డ్వామా, వాటర్ షెడ్ రెండూ అనుసంధానించుకుని పనిచేయాలని, హార్టికల్చర్ ప్లాంటేషన్ కు కేటాయించిన లక్ష్యాలను ఖచ్చితంగా చేరుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం పిటిషన్లకు సంబంధించి ప్రిమెచ్యూర్ గా పిటిషన్లను క్లోజ్ చేయరాదని, పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం అయిన తర్వాతనే పిటిషన్లు పరిష్కరించామని క్లోజ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లీనిక్స్ భవనాల్లో పూర్తయ్యే దశలో ఉన్నవి వెంటనే పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన మండలాల్లో త్వరితగతిన పురోగతి సాధించాలన్నారు.

మాట్లాడుతున్న పిఆర్ ఆర్డీ కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ గౌతమి

కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీలను మరింత పెంచాలని, జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో ఏపీడీల వారిగా లేబర్ బడ్జెట్ అచీవ్మెంట్, హౌస్ హోల్డ్ వారిగా ఎంప్లాయ్మెంట్ ప్రొవైడెడ్, మాస్టర్ల వెరిఫికేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, ఆర్బికెలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈజిఎస్ డైరక్టర్ చిన్న తాతయ్య, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ అశోక్, ఈజిఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, హార్టికల్చర్ జాయింట్ కమిషనర్ అశోక్ కుమార్, హార్టికల్చర్ డిప్యూటీ కమిషనర్ భవాని, డ్వామా పీడీలు వేణుగోపాల్ రెడ్డి, రామాం జనేయులు, జడ్పి సిఈఓ భాస్కర్రెడ్డి, పీఆర్ ఎస్ఈలు భాగ్యరాజ్, గోపాల్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రావు, రెండు జిల్లాల ఏపీడీలు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్డ్రైవ్

టెలీ కాన్ఫరెన్స్లో కలెక్టర్ యం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024 కింద జిల్లాలో శని, ఆదివారాల్లో ఇంటింటి పరిశీలనలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం రాత్రి అనంతపురం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024కి సంబంధించి ఇంటింటి పరిశీలనలో భాగంగా చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ పై ఈఆర్ఓలు, ఎఈఆర్ఓలు, తదితరులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన శనివారం, 13వ తేదీన ఆదివారం రెండు రోజులపాటు ఇంటింటి పరిశీలనలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, అన్ని చోట్ల నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక డ్రైవ్లో ఎవరైనా ఓటు హక్కు నమోదు చేసుకునేవారు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1950కి ఫోన్ చేయొచ్చన్నారు. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని ఈఆర్ఓలు, ఎఈఆర్ఓలను ఆదేశించారు. ఓటు హక్కు నమోదు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వాసుపత్రికి ఆక్సిజన్ ఆటో ఎక్స్పో మీటర్లు అందజేస్తున్న దాతలు

ఆసుపత్రికి ఆక్సిజన్ ఆటో ఎక్స్పో మీటర్లు అందజేత

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం కొరియన్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వారు రూ. 4 లక్షలు విలువ చేసే ఆక్సిజన్ ఆటో ఎక్స్పో మీటర్లు, బూస్ట్ పదార్థాలను డాక్టర్ శివకుమార్స్వామి, బాబా బుడెన్ సమక్షంలో హాస్పిటల్ కమిటీ మెంబర్ కొండలరాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. కొరియన్ బృందం ఒక అసోసియేషన్గా ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అసోసియేషన్ అధ్యక్షుడు మిస్టర్ జోంగ్ 15 మంది మిత్ర బృందం వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్సిలో గర్భిణులకు అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయుడు సంజీవరాయుడు

పిహెచ్సిలో గర్భిణులకు భోజన వసతి

సోమందేపల్లి : స్థానిక సాయినగర్లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సంజీవరాయుడు శుక్రవారం స్థానిక పిహెచ్సిలో వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో 'నా భూమి-నా దేశం'

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో నా భూమి-నా దేశం మట్టికి ప్రణామాలు వీరులకు వందనాలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హై స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే మొక్కలు, మట్టి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించా రు. కార్యక్రమంలో పాలసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచి కె.చిన్నగంగప్ప, ఎంపిపి ప్రమీలమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లుమర్రి పంచాయతీలో..

మడకశిర : మండల పరిధిలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచి గంగమ్మ నాగరాజు అమర వీరుల ప్రాణ త్యాగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఒఆర్డి శైలజ, సెక్రటరీ వరదరాజు, గ్రామ పెద్దలు నారాయణగౌడ్, నర్సేగౌడ్, రామలింగప్ప, పెద్దమూర్తి, కదిరి నరసింహమూర్తి, నరసన్న, కొండప్ప,ముని, బాల బాలికలు పాల్గొన్నారు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి : మండల పరిధిలోని 33 కె.వి శిరివరం లైన్ మరమ్మతుల కారణంగా 33/11 శిరివరం సబ్ స్టేషన్ పరిధిలోని శిరివరం, గోపిందేవరపల్లి, మనేపల్లి, గౌరిగానిపల్లి, వెంకటాపురం, తిరుమలదేవరపల్లి, కోడిపల్లి, విభూతిపల్లి, నాగేపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని ఎఇ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

కుక్క దాడిలో పలువురికి గాయాలు

రొద్దం : మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఇళ్ల ముందు నిద్రిస్తున్న పలువురిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. వారిలో శ్రీనివాసులు, గంగాధర్, ఈర్ఫాన్, నారాయణ రెడ్డి, మారెక్క, ఆదినారాయణ, హేమ, స్వరూప్తో పాటు మరికొందరిరు పెనుకొండ, అనంతపురం, తదితర ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అందులో మారెక్క తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.

టిడిపి కార్యకర్తపై దాడి హేయం

ప్రజాశక్తి-సోమందేపల్లి

టిడిపి కార్యకర్తపై అధికార వైసిపి నాయకుడు దాడి చేయడం హేయమైన చర్య అని పెనుకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు కురుబ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమందేపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గోరంట్ల మండలం వెంకటరమణపల్లిలో భూమి విషయంలో వైసిపి నాయకుడు చెవిరెడ్డి మరో పది మందితో కలిసి వేట కొడవళ్లు, బీరు బాటిళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. అతడికి ఏమైనా జరిగితే వైసిపి నాయకులే కారణమన్నారు. గాయపడిన వ్యక్తికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని మండిపడ్డారు. దాడి చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని, అలాగే బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మండల మీట్లో విద్యుత్ సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-కనగానపల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంల రసాభాసగా సాగింది. ముందుగా పలువురు సభ్యులు మండలంలో నెలకొన్న అప్రకటిత విద్యుత్ సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. అయితే విద్యుత్ సమస్యలపై వివరణ ఇవ్వాల్సిన మండల ఎఇ సమావేశానికి గైర్హాజరు కావడంతో సభ్యులు ఆవేదన అరణ్య రోదనగా మిగిలింది. విద్యుత్ సమస్యలపై అజెండా ప్రారంభం కాగానే సమావేశంలో సభ్యులు ఒకరి తర్వాత ఒకరు విద్యుత్ సమస్యలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా ముత్తువకుంట్ల ఎంపిటిసి శ్రీరాములు మాట్లాడుతూ పంచాయతీలో వున్న ట్రాన్స్ఫార్మర్స్ అన్నీ సమస్యగానే వున్నాయన్నారు. ఏడాడిగా ఈ విషయాన్ని సభ దృష్టికి తెస్తున్నా, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల తోటల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్స్కు జంపర్ వేయటానికి లైన్మెన్ రావాలంటే ముందు రూ. 500 ఇస్తేనే వస్తానని చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కుంపటి భాగ్యమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో విద్యుత్ సమస్యలను ఏకరువు పెడుతున్న సభ్యులు